సమస్యల వలయంలో గేటెడ్ కమ్యూనిటీ

- డ్రైనేజీ, తాగునీరు, రోడ్ల సమస్యలతో ఇక్కట్లు
- ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోని అధికార యంత్రాంగం
- రోడ్ల కోసం ఇటీవల చిన్నారుల నిరసన
- గేటెడ్ కమ్యూనిటీ వాసుల తిప్పలు ఎవరికీ పట్టని వైనం..

రామచంద్రాపురం, ఫిబ్రవరి 7 : తెల్లాపూర్ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. పేరుకు మాత్రమే గేటెడ్ కమ్యూనిటీలు కానీ, అందులో నివాసం ఉంటున్న వారు ఎలాంటి సౌకర్యాలు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో ఇంటి పన్నులు చెల్లించినా.. ఆయా కాలనీలకు పూర్తి స్థాయిలో మౌలికసదుపాయాలు సమకూర్చడంలో అధికార యంత్రాంగం విఫలమవుతున్నది. డ్రైనేజీ, తాగునీరు, రోడ్ల సమస్యలతో గేటెడ్ కమ్యూనిటీ వాసులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. చిన్నారులు స్కూళ్లకు వెళ్లేందుకు కూడా కాలనీల్లోకి స్కూల్ బస్సులు రాలేని పరిస్థితిలో రోడ్ల దుస్థితి ఉంది. గేటెడ్ కమ్యూనిటీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలపై పలుమార్లు నిరసనలు చేపట్టినా.. వినతిపత్రాలు సమర్పించినా తమ సమస్యలు మాత్రం పరిష్కారమవుతలేవని గేటెడ్ కమ్యూనిటీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాది ఇంటి పన్నులు సకాలంలో చెల్లించినా అభివృద్ధికి నోచుకోవడం లేదని కాలనీవాసులు అంటున్నారు. తెల్లాపూర్ పరిధిలో 44 గేటెడ్ కమ్యూనిటీలు, సుమారుగా 30 వేల జనాభా ఉంది. 44 గేటెడ్ కమ్యూనిటీల్లో కేవలం బ్లూఫీల్డ్, ఆదిత్య విల్లాస్‌లో మాత్రమే తాగునీటి సరఫరా ఉం ది. మిగతా ఏ గేటెడ్ కమ్యూనిటీకి తాగునీటి సరఫరా లేకపోవడంతో కాలనీవాసులు తాగునీటి కోసం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది.

తెల్లాపూర్‌లోని గేటెడ్ కమ్యూనిటీ వ్యూ

రోడ్ల కోసం చిన్నారుల నిరసన

రోడ్లు బాగు చేయాలని చివరికి చిన్నారులు కూడా నిరసన చేయాల్సి వచ్చింది. రోడ్లు బాగా లేకపోవడంతో చిన్నారులు సైతం రోడ్డుపైకి వచ్చి రోడ్లను బాగు చేయాలని పాదయాత్ర నిర్వహించారు. సంవత్సరాల కొద్ది సరియైన రోడ్లు లేకపోవడంతో స్కూల్ విద్యార్థులు, ఉద్యోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అభివృద్ధిలో తెల్లాపూర్ వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ ప్రజలకు కావాల్సిన కనీస మౌలికవసతుల కల్పన విషయంలో మున్సిపల్ పాలకవర్గం, అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. గేటెడ్ కమ్యూనిటీలు కూడా మున్సిపాలిటీ పరిధిలోనే ఉన్నాయి. వాళ్లు కూడా ఓట్లు వేస్తున్నారు.. కానీ, గేటెడ్ కమ్యూనిటీల మీద పాలకవర్గం చిన్నచూపు ఎందుకు చూస్తుందో తెలియడం లేదని కమ్యూనిటీ వాసులు అంటున్నారు. మున్సిపాలిటీకి కోట్లాది రూపాయల నిధులు వస్తున్నప్పటికీ గేటెడ్ కమ్యూనిటీ సమస్యల మీద ఏమాత్రం నిధులు వినియోగించడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటికి ఇబ్బందులు..

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో వందల సంఖ్యలో వెంచర్లు వచ్చాయి. జనాభా రోజురోజుకూ పెరుగుతున్నది. ఫైనాన్షియల్ జిల్లాకు దగ్గర్లో ఉండడంతో తెల్లాపూర్, ఉస్మాన్‌నగర్, కొల్లూర్, నాగులపల్లి, వెలిమెలలో నివాసం ఉండేందుకు చాలా మంది ఆసక్తి చూపిస్తున్నారు. హైదరాబాద్ కాలుష్యానికి దూరంగా ప్రశాంత వాతావరణంలో స్థిరపడేందుకు తెల్లాపూర్ మున్సిపాలిటీకి జనాలు వస్తున్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలికసదుపాయాలను కల్పించడంలో ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం విఫలమవుతుందని చెప్పుకోవచ్చు. గేటెడ్ కమ్యూనిటీలతో పాటు ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకూడదని జనాభాకు అనుగుణంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఉస్మాన్‌నగర్‌లో తాగునీటి రిజర్వాయర్ నిర్మాణాన్ని చేపట్టింది. అప్పట్లో పనులు వేగంగా జరిగినప్పటికీ ప్రస్తు తం వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. రిజర్వాయర్ పనులు పూర్తిచేసి తాగునీటి పైప్‌లైన్లను ఏర్పాటు చేస్తేగానీ గేటెడ్ కమ్యూనిటీ వాసులకు నీటి కష్టాలు తీరవు.

ఒకరికి ఒకరు సాయంగా..

గేటెడ్ కమ్యూనిటీ వాసులకు సమస్యలు సవాల్ చేస్తున్న క్రమంలో సమస్యలను అధిగమించడానికి వారు 'వాట్సాప్ గ్రూప్'ని క్రియోట్ చేశారు. రవాణా సౌకర్యం సరిగ్గా లేకపోవడంతో కాలనీల్లోకి ఊబర్, వోలా, ర్యాపిడో వంటి సేవలు కష్టమవుతున్నాయి. దీంతో ఆ వాట్సాప్ గ్రూ ప్‌లో ఎవరైనా బయటకు వెళ్లాలంటే ముందు గ్రూప్‌లో మేసేజ్ చేస్తారు. అది చూసి ఆయా కమ్యూనిటీ వాసుల్లో ఎవరైనా అదే సమయానికి బయటకు వెళ్తుంటే సదరు వ్యక్తులను వారే పికప్ చేసుకుంటారు. ఇలా అన్నివిధాలుగా గేటెడ్ కమ్యూనిటీ వాసులు ఒకరికి ఒకరు సాయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలంటూ గేటెడ్ కమ్యూనిటీ వాసులు కోరుతున్నారు.

తెల్లాపూర్‌లో ఓపెన్ డ్రైన్‌లో నిలిచిపోయిన డ్రైనేజీ

రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నాం..

తెల్లాపూర్ గేటెడ్ కమ్యూనిటీ వాసులకు సరైన రవాణా సౌకర్యం లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. రోడ్లను బాగు చేయాలని స్థానిక అధికారుల నుంచి ఉన్నతాధికారుల వరకు, స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి మంత్రుల వరకు వినతిపత్రాలు సమర్పించినా మా సమస్యలు పరిష్కారం కావడం లేదు. తెల్లాపూర్ మున్సిపాలిటీకి సకాలంలో ఇంటి పన్నులు చెల్లిస్తున్నాం.. ప్రభుత్వం తెల్లాపూర్ గేటెడ్ కమ్యూనిటీలపై దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నాం.

- ఈశ్వరిగారి రమణ, టీనా అధ్యక్షుడు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

ఖానాపూర్ కేలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్, ఫిబ్రవరి 7: కల్హేర్ మండల పరిధిలోని మార్డి గ్రామానికి చెందిన దూదెకుల సానియాకు రూ. 15 వేలు, ఫతేపూర్ గ్రామానికి చెందిన భార్గవికి రూ. 10 వేలు, పొమ్యా నాయక్ తండాకు చెందిన మీరాబాయికి రూ. 14,500 మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి శుక్రవారం ఖానాపూర్ కేలోని నివాస గృహంలో లబ్ధిదారులకు అందజేశారు. మండలాధ్యక్షుడు రాంసింగ్, నాయకులు జనార్దన్, గణపతి, సుధాకర్, వెంకట్‌నాయక్, రాంసింగ్, పర్‌లాల్ ఉన్నారు.

పరామర్శ

నారాయణఖేడ్, ఫిబ్రవరి 7: నారాయణఖేడ్ మండలం జూకల్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త జయరామ్ కాలికి ఇటీవల శస్త్రచికిత్స చేశారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూ పాల్‌రెడ్డి పరామర్శించారు. వెంట నాయకులు లక్ష్మణ్‌రావు, సాయిలు, సిద్ధప్ప ఉన్నారు.

ఘనంగా పాతపంటల జాతర

జాతరను ప్రారంభిస్తున్న డీడీఎస్ మహిళలు

ఝరాసంగం, ఫిబ్రవరి 7 : ఝరాసంగం మండల కేంద్రంలో పస్తాపూర్ డీడీఎస్ వారి ఆధ్వర్యంలో 25వ పాతపంట జాతరను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జాతరలో భాగంగా ప్రధాన దేవాలయాల వద్ద పూజలు నిర్వహించిన అనంతరం గ్రామంలోని వీధి వీధినా మహిళాలు బోనాలతో, ఆటపాటలతో, విత్తనాలతో అలంకరించిన బండ్లనూ ఊరేగిస్తూ చిరుధాన్యాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సిబ్బంది విజయలక్ష్మి, నర్సమ్మ, చుక్కమ్మ, శ్రీలయ, ప్రహ్లద్, నర్సింహులు, సంపత్ పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

డ్యూటీ డాక్టర్ దివాకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నేతలు

సదాశివపేట, ఫిబ్రవరి 7 : ప్రభుత్వ దవాఖానలో పని చేస్తున్న శానిటేషన్, పేమెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటరాజ్యం డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రభుత్వ దవాఖానలో సూపరింటెండ్ అందుబాటులో లేకపోవడంతో డ్యూటీ డాక్టర్ దివాకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఏడు నెలలుగా బిల్లులు రావడంలేదని కాంట్రాక్టర్లు చెప్పారని గుర్తు చేశారు. కార్మికులకు జీతాలు రాకపోవడంతో కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ జీతాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, ఇందు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కూర రఘోత్తం రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 7 : విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం ఉపాధ్యాయుల గౌరవాన్ని పెంపొందించడమే లక్ష్యంగా పని చేస్తామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కూర రఘోత్తం రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల పర్యటనలో భాగంగా శుక్రవారం సంగారెడ్డిలోని ఎస్టీయూటీఎస్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్టీయూటీఎస్, టీపీసీజేఎల్ అసోసియేషన్, పీఆర్టీయూటీజీ, ఎంఎస్‌టీయూ, కేజీబీవీ, రెసిడెన్షియల్ తదితర 32 ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో బరిలోకి దిగమన్నారు. 38 ఏండ్లుగా ప్రభుత్వ విద్యారంగంలో అందిస్తున్న సేవలను గుర్తు చేశారు. ఉపాధ్యయ సంఘంలో సామాన్య కార్యకర్త నుంచి మండల, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి నాయకుడిగా రాణించి విద్యారంగ సమస్యలపై పోరాడిన తీరును వివరించారు. 317జీవోలో అనేక తప్పులు ఉన్నాయన్నారు. ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో మీ అమూల్యమైన మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపిస్తే ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. కార్పొరేట్, రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థల యజమానులు ధన బలంతో ఉపాధ్యాయ ఎమ్మె ల్సీ స్థానాన్ని కైవసం చేసుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. అంతకుముందు తారా ప్రభుత్వ కళాశాల మైదానం, కలెక్టరేట్ వెనుకలో ఉన్న అంబేద్కర్ పార్కులను సందర్శించి వాకర్ ఉపాధ్యాయులను ఓటు అభ్యర్థించారు. ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ సాబేర్ అలీ, శ్రీనివాస్ రాథోడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్ కుమార్, నాయకులు రమణ కుమార్, విజయ్ కుమార్, సుందరరావు, నర్సింహరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాక్స్ డ్రైనేజ్‌లో కూరుకుపోయిన లారీ


బాక్స్ డ్రైనేజీలో ఇరుక్కున్న లారీ

పటాన్‌చెరు, ఫిబ్రవరి 7 : 65వ నెంబర్ జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న లారీ ముత్తంగి వద్ద పక్కన నూతనంగా నిర్మించిన బాక్స్ డ్రైనేజీలో కూరుకుపోయింది. సంగారెడ్డి చౌరస్తా నుంచి మియాపూర్ వరకు జాతీయ రహదారిని విస్తరిస్తున్నారు. విస్తరణ పనులు జాతీయ రహదారికి రెండు వైపులా జరుగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం ఒక లారీ డ్రైవర్ పక్కకు వాహనం అపేందుకు ప్రయత్నించాడు. ఈ సందర్భంలో లారీ ముందు టైరు ఒకటి కొత్తగా నిర్మించిన బాక్స్ డ్రైనేజీ స్లాబ్ పగిలి ఇరుక్కుపోయింది. నేషనల్ హైవే నిర్మాణం పనుల నాణ్యతపై, కాంట్రాక్టర్ పనితీరుపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

కార్ల లోడ్‌తో వెళ్లిన డబుల్ డెక్కర్ రైలు

జహీరాబాద్ రైల్వే స్టేషన్ నుంచి భారీ కార్లలోడ్‌తో వెళ్తున్న డబుల్ డెక్కర్ రైలు

జహీరాబాద్, ఫిబ్రవరి 7: జహీరాబాద్ పట్టణ రైల్వే స్టేషన్ మీదుగా కార్ల లోడ్‌తో వెళ్తున్న డబుల్ డెక్కర్ రైలును జహీరాబాద్ పట్టణ ప్రజలు ఆసక్తిగా తిలకించారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూర్ ప్రాంతం నుంచి కార్ల లోడ్‌తో మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌కు జహీరాబాద్ పట్టణం మీదుగా వెళ్లింది. ప్రతి రోజు ఈ రైల్వే స్టేషన్ మీదుగా ప్యాసింజర్, గూడ్ రైలు మాత్రమే వెళ్తుంటాయి. ఎప్పుడు కూడా ఇలాంటి రైలు ఇక్కడ నుంచి వెళ్లలేదని, తొలిసారిగా కార్లలోడ్‌తో డబుల్ డెక్కర్ రైలు వెళ్తుందని పట్టణ ప్రజలు తెలిపారు. కానీ, భారీగా కార్లలోడ్‌తో జహీరాబాద్ పట్టణం రైల్వే స్టేషన్ మార్గం గుండా వెళ్తున్న డబుల్ డెక్కర్ రైలును చిన్నారుల నుంచి పెద్దల వరకు ఆసక్తి చూశారు.

సాహెబ్ దర్గాను దర్శించిన బీఆర్‌ఎస్ నాయకులు

దర్గాను సందర్శించి ప్రార్థనలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

జహీరాబాద్, ఫిబ్రవరి 7 : మండల కేంద్రమైన న్యాల్‌కల్ గ్రామ శివారులోని పీర్ గైబ్ సాహెబ్ దర్గాను శుక్రవారం మండల బీఆర్‌ఎస్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక దర్గాను సందర్శించిన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నాయకులు భాస్కర్, సంజీవ్, ప్రవీణ్, శ్రీనివాస్, సురేశ్, అంజీ, ఇస్మాయిల్, జాతర ఉత్సవ కమిటీ అధ్యక్షుడు యూనుస్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలి

రేజింతల్‌లో ప్రజలను అడిగి తెలుసుకుంటున్న డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సాబేర్ హుస్సేన్

జహీరాబాద్, ఫిబ్రవరి 7 : వేసవి దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని జహీరాబాద్ డివిజన్ ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సాబేర్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం సంబంధిత జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో న్యాల్‌కల్ మండలంలోని రేజింతల్, ఖలీల్‌పూర్, మిర్జాపూర్(బి), గంగ్వార్, న్యామతాబాద్, మామిడ్గి తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని స్థానిక గ్రామ పంచాయతీలో తాగునీటి సరఫరా కోసం వినియోగించే ఎనిమిది రకాల రికార్డులను పరిశీలించారు. పంచాయతీల్లో బ్లీచింగ్ పొడర్ నిల్వ, క్లోరినేషన్, తాగునీటి సరఫరా తదితర వివరాలను గ్రామ పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఇంటింటికీ సరఫరా చేస్తున్న మీషన్ భగీరథ తాగునీటి గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు కాలుషితం కాకుండా పైప్‌లైన్ లీకేజీలుంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లోని ఓహెచ్‌ఎస్‌ఆర్, జీఎల్‌ఎస్‌ఆర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు వచ్చే ప్రాంతాలను గుర్తించి, సమస్యల పరిష్కారానికి ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

హరీశ్‌రావును కలిసిన మాజీ జడ్పీటీసీ

మాజీ మంత్రి ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావును శుక్రవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు, జిన్నారం మాజీ జడ్పీటీసీ కొలను బాల్ రెడ్డి గచ్చిబౌలిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం బాల్‌రెడ్డి ఉమ్మడి జిన్నారం మండలంలో చేపడుతున్న పార్టీ కార్యక్రమాలపై మాజీ మంత్రికి వివరించారు.

-జిన్నారం ఫిబ్రవరి 7

బస్సులే.. బస్సులు

ఒక్కోసారి ఒక్కటి రాదు.. వస్తే ఒకేసారి నాలుగు బస్సులు

కవేలి బస్టాప్ వద్ద నిలిచిన బస్సులు

కోహీర్, ఫిబ్రవరి 7 : ప్రయాణికులకు ఒక్కోసారి ఒక్క బస్సు అందుబాటులో ఉండదు. కానీ, శుక్రవారం మధ్యాహ్నం సమయంలో కవేలి గ్రామ జాతీయ రహదారి బస్టాప్ వద్దకు ఒకే సారి నాలుగు బస్సులు చేరుకున్నాయి. వాటిలో నుంచి కొంత మంది కిందకు దిగారు. కానీ, అక్కడఉన్న ప్రయాణికులు, స్థానికులు ఆశ్చర్యానికి లోనయ్యారు. ఒక్కో సారి ఒక గంట గడిచినా సమయానికి ఆర్టీసీ బస్సు రాదని ఇప్పుడు ఒకేసారి నాలుగు బస్సులు వచ్చాయని చర్చించుకున్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు కవేలి వైపు నుంచి కోహీర్ మీదుగా తౌరమామిడి వెళ్లే ఆర్టీసీ బస్సు సేవలను మూడు రోజుల నుంచి నిలిపివేశారన్నారు. వెంటనే బస్సును పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. సమయానుకూలంగా బస్సులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పంటల సాగు వివరాలు నమోదు చేసుకోవాలి

కల్హేర్, ఫిబ్రవరి 7: యాసంగిలో రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను వ్యవసాయ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వెంకటేశం రైతులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని రాపర్తి గ్రామ శివారులో బోరుబావుల కింద రైతులు సాగుచేసిన వరి పంటను పరిశీలించారు. పంట ఎదుగుదలకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం వంటల సాగు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. ఆయన వెంట ఏఈవో కృష్ణవేణి, రైతులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ నేత గౌరీశంకర్‌గౌడ్ మృతి

గౌరీశంకర్‌గౌడ్ (ఫైల్)

గుమ్మడిదల, ఫిబ్రవరి 7 : బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు బొంతపల్లి గౌరీశంకర్‌గౌడ్ అనారోగ్యంతో మృతి చెందారు. మండలంలోని బొంతపల్లి గ్రామానికి చెందిన ఉప్పునూతుల గౌరీశంకర్ తెలంగాణ ఉద్యమంలో కీలకప్రాత పోషించారు. శుక్రవారం ఆయన మృతితో ఉమ్మడి జిన్నారం మండల నాయకులతో పాటు జిల్లా నాయకులు తీవ్రదిగ్భాంతి వ్యక్తం చేశారు. నాయకులు గోవర్ధన్‌రెడ్డి, జీ.వెంకటేశంగౌడ్, మండల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కారయదర్శి నరహరి, యావన్నగారి సంతోష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సద్దిప్రవీణావిజయభాస్కర్ రెడ్డి, మాజీజడ్పీటీసీ కు మార్‌గౌడ్, మాజీసర్పంచ్‌లు ఆలేటి నవీనాశ్రీ నివాస్‌రెడ్డి, దోమడుగు రాజశేఖర్, చిమ్ముల నర్సింహారెడ్డి, పార్టీ శ్రేణులు సంతాపం తెలియజేశారు. శనివారం బీఆర్‌ఎస్ నాయకుడు గౌరీశంకర్ అంత్యక్రియలను స్వగ్రామమైన బొంతపల్లిలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

రాయికోడ్ మండల పరిధిలోని రాయిపల్లి(సి) గ్రామానికి చెందిన బుర్జుకాడి గౌసు ఇల్లు కాలిపోవడంతో శుక్రవారం పరామర్శిస్తున్న అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్.

-రాయికోడ్, ఫిబ్రవరి 7

సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తాం..

- కొల్లూర్ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల లబ్ధిదారులతో కలెక్టర్ సమావేశం
- కలెక్టర్‌కి సమస్యలను వివరించిన లబ్ధిదారులు
- కమిషనర్ గైర్హాజరుపై కలెక్టర్ సీరియస్..

లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరిక్రాంతి

రామచంద్రాపురం, ఫిబ్రవరి 7 : కొల్లూర్ డబుల్ బెడ్‌రూం ఇండ్ల సముదాయంలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని కలెక్టర్ వల్లూరిక్రాంతి అన్నారు. శుక్రవారం కొల్లూర్ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల సముదాయంలో లబ్ధిదారుల సమస్యలను తెలుసుకునేందుకు వారితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల సముదాయంలో ఉన్న సమస్యలపై ఇటీవల పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆమె డబుల్ బెడ్‌రూం ఇండ్ల సముదాయాన్ని సందర్శించి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి, డ్రైనేజీ, లిఫ్ట్ మరమ్మతుల సమస్యలతో పాటు ఆర్టీసీ సౌకర్యం, అంగన్‌వాడీ భవనం, ప్రాథమిక పాఠశాల, దవాఖాన, టెలికమ్యూనికేషన్, రేషన్ దుకాణం, పోలీస్ స్టేషన్, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తదితర సౌకర్యాలను ఏర్పాటు చేయించాలని లబ్ధిదారులు కలెక్టర్‌ని కోరారు. దీనికి స్పందించిన కలెక్టర్ ఇప్పటివరకు డబుల్ బెడ్‌రూం ఇండ్లల్లో సుమారుగా 7800 కుటుంబాలు 30వేల జనాభా నివాసం ఉంటున్నారని, ఇంకో 30వేల జనాభా వచ్చే అవకాశం ఉన్నదని తెలిపారు. డబుల్ బెడ్‌రూం సముదాయంలో అన్ని రకాల వసతులను కల్పిస్తామని చెప్పారు. లబ్ధిదారులు ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని త్వరితగతిన సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. అధికారులతో కలిసి లబ్ధిదారులు కూడా మంచి కమ్యూనిటీలను ఏర్పాటు చేసుకొని కలిసికట్టుగా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. జీహెచ్‌ఎంసీ, మున్సిపల్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలను పరిష్కరించాలని ఆమె అధికారులను ఆదేశించారు. అనంతరం ఆమె వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ కొల్లూర్ 2బీహెచ్‌కే సందర్శించేందుకు వచ్చిన నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి గైర్హాజరు కావడంతో ఆమె సీరియస్ అయ్యారు. కమిషనర్‌కి కాల్ చేసి కార్యక్రమానికి ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ముందుగానే కలెక్టర్ విజిట్ ఉన్నదని మీకు సమాచారం ఉంది కదా లీవ్ ఎందుకు పెట్టుకున్నారని అడిగారు. కలెక్టర్ 2బీహెచ్‌కే విజిట్ ఉం దని తెలిసి కమిషనర్‌కు లీవ్ ఎలా మంజూరు చేస్తారని అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్‌ని ప్రశ్నించారు. ఈ విషయంపై ఆమె కమిషనర్‌ను వివరణ కోరారు. ఆర్డీవో రవీందర్‌రెడ్డి, డీఈవో వెంకటేశ్వర్లు, జిల్లా సంక్షేమ అధికారిని లలిత కుమారి, తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డి, ఆర్‌ఐ శ్రీకాంత్, జీహెచ్‌ఎంసీ, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

తారా అధ్యాపకురాలికి డాక్టరేట్

భౌతిక శాస్త్ర అధ్యాపకురాలు మంజుల

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 7 : తారా ప్రభుత్వ కళాశాల భౌతిక శాస్త్ర అధ్యాపకురాలు మంజులకు డాక్టరేట్ ప్రదానం చేశారు. రాజస్థాన్ రాష్ట్రంలోని ఝుంఝును ప్రాంతంలోని జగదీశ్ ప్రసాద్ జబర్మల్ టిబ్రీవాలా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారు. డాక్టర్ గంగాధర్ రివర్ పర్యవేక్షణలో 'సిమ్యులేషన్ ఆఫ్ కాంపోజిట్ ఫైబర్స్ ఫర్ ఏరో అప్లికేషన్' అనే అంశంపై పరిశోధన జరిపినందు కు డాక్టరేట్ అవార్డును లభించింది. ఈ మేరకు శుక్రవారం తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నప్రసాద్, అధ్యాపకులు మంజులను అభినందించారు.

న్యాయ చట్టాలపై అవగహన

అందోల్, ఫిబ్రవరి 7 : మండల లీగల్ సెల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని అక్సాన్‌పల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో జోగిపేట కోర్టు న్యాయవాదులు ప్రజలు, విద్యార్థులకు అవగహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయ చట్టాలపై అవగాహన కల్పించారు. సంవత్సరానికి రూ. 3 లక్షల లోపు ఆదాయం ఉన్నవారు ఎవరైనా న్యాయపరంగా ఇబ్బందులుంటే ఉచితంగా న్యాయ సేవలు పొందవచ్చన్నారు. అందుకోసం మండల లీగల్‌సెల్ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. న్యాయవాదులు హరి నారాయణ శర్మ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగులను నివారిద్దాం..

బొల్లారం, ఫిబ్రవరి 7 : నులి పురుగులను నివారిద్దామని, ఒకటి నుంచి 19 ఏండ్ల వయస్సున్న విద్యార్థులకు, యువతకు నివారణ టాబ్లెట్‌లు వేయిద్దామని వైద్యాధికారులు కోరారు. శుక్రవారం బొల్లారం మున్సిపాలిటీలో మెడికల్ ఆఫీసర్ 2 రాజకుమారి ఆధ్వర్యంలో జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా బొల్లారం మున్సిపాలిటీలో సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ నెల 10న 19 ఏండ్లలో ఉన్న వారికి నులిపురుగుల మాత్రలను వేయాల్సి ఉందని తెలిపారు. పాఠశాలలు, కాలేజీల్లో నులిపురుగుల నివారణ టాబ్లెట్స్ వేయనున్నట్లు తెలిపారు. హెచ్‌ఈవో బారీ, మేనేజర్ మల్లికార్జున స్వామి, ఆర్వో నర్సింహులు, వార్డ్ ఆఫీసర్స్, రిసోర్స్ పర్సన్స్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్రపర్యటన

నారాయణఖేడ్, ఫిబ్రవరి 7 : నారాయణఖేడ్ మండలం రుద్రారం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఇందులో భాగంగా వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి నూతన సాగు విధానాలు, నేలల రకాలు, డ్రిప్, స్ప్రింక్లర్ విధానం, అంతర పంట సాగు, విత్తులు విత్తే పద్ధతి తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు రవీందర్, ఉపాధ్యాయులు జగదీశ్వర్, దత్తాత్రి, శివాజీ, గోవింద్ పాల్గొన్నారు.

వాహనంపై భారీ ట్రాన్స్‌ఫార్మర్ తరలింపు

జాతీయ రహదారిపై తరలిస్తున్న భారీ ట్రాన్స్‌ఫార్మర్

జహీరాబాద్, ఫిబ్రవరి 7 : జహీరాబాద్ పట్టణ సమీపంలోని హైదరాబాద్ – ముంబయి జాతీయ రహదారిపై భారీ వాహనం భారీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇండోర్‌ను తరలించారు. శుక్రవారం హైదరాబాద్ ప్రాంతం నుంచి తోషిబా కంపెనీలో తయారు చేసిన భారీ ట్రాన్స్‌ఫార్మర్‌ను మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు జాతీయ రహదారి గుండా భారీ వాహనంపై తీసుకెళ్తుండడంతో ప్రజలు ఆసక్తిగా చూశారు.

డ్రైనేజీ నిర్మాణం ప్రారంభం

కోహీర్, ఫిబ్రవరి 7 : మండలంలోని చింతల్‌ఘాట్ గ్రామ ఎస్సీ కాలనీలో మురుకు కాల్వ నిర్మాణాన్ని శుక్రవారం ప్రారంభించారు. సజ్జాపూర్ గ్రామానికి చెందిన వ్యాపారవేత్త ప్రసాద్‌రెడ్డి తన సొంత నిధులతో 200 మీటర్ల డ్రైనేజీ నిర్మాణానికి యంత్రాల సాయంతో పనులు చేపట్టారు. నిర్మాణానికి రూ. 4 లక్షల వరకు ఖర్చు అవుతుందన్నారు. తమ కాలనీలో డ్రైనేజీని నిర్మిస్తునందుకు ప్రసాద్‌రెడ్డిని వారు అభినందించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

రాయికోడ్, ఫిబ్రవరి 7 : మండల పరిధిలోని రాయిపల్లి(సి) గ్రామంలో షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు శుక్రవారం దగ్ధమైంది. కుటుంబీకులు, ఎస్సై నారాయణ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన బుర్జుకాడి మహిమూద్‌కు చెందిన ఇల్లు కాలిపోయింది. ఇందులో రూ.1.12 లక్షలు నగదు, ఐదు తులాల బంగారం పూర్తిగా కాలిపోయాయి. దీంతో పాటు ఇంట్లో ఉన్న పలు రకాల వస్తువులు దగ్ధమయ్యాయి. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.